వైద్యులకు ముగిసిన శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): మాతృమరణాలను తగ్గించేందుకు వైద్యులకు రెండు రోజులుగా ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. రెండోరోజు డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్దాస్పత్రి గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ గర్భస్థకాలంలో వచ్చే రక్తహీనత, రక్తస్రావం, డయాబెటీస్, అధిక రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యలను గుర్తించి చేయాల్సిన చికిత్స, రెఫరల్ విధానంపై వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రమాదకర లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స చేసి అవసరమైన వారిని అన్ని వసతులున్న ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో అర్మాన్ సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ కావ్య, డెమో ప్రమీలమ్మ, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, పీసీ పీఎన్డీటీ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెల విరమణ

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె విరమించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు గతంలో ఇస్తున్న వేతనానికి రూ.6 వేలు కలిపి ఇవ్వడంతో వారి వేతనం రూ.21 వేలకు చేరిందన్నారు. అదనంగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు ఉంటాయన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంబంధించి 2017 నుంచి ఎవరికైతే జీతాలు పెరగలేదో వారికి జీతాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

భూమి కొనుగోలు పథకంపై విచారణ జరిపించండి

కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని భూమి కొనుగోలు పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల వెంకటేష్ గురువారం విజయవాడలోని ఎస్సీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సునీల్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆదోని, బనగానపల్లె ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయని,ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌టీఐ యాక్ట్‌కు విరుద్ధంగా ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

కర్నూలు (అర్బన్): వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా గురువారం బీసీ భవన్ వద్ద ఆయన విగ్రహానికి వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో నగరాభివృద్ధికి కృషి చేశా

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ఐదేళ్లలో కర్నూలు నగరాభివృద్ధికి కృషి చేశానని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులు, రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. పార్కులు, రోడ్లు, రహదారులు, నగరాన్ని పచ్చదనం, సుందరీకరణ వంటి పనులను పెద్ద ఎత్తున చేపట్టామన్నారు.

ప్రజాదర్బార్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తన స్వగృహంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు కాలనీ వాసుల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



కొండా రెడ్డి బురుజు వద్ద అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఘనంగా ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, స్కూల్ చైర్మన్ ఏకే అగర్వాల్ హాజరై ప్రసంగించారు. వీరితో పాటు స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ సతీష్, డాక్టర్ గాంధీ, డాక్టర్ మనోజ్, అజిత్ పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతుల స్కూల్ కర్నూలు లో ఉండటం సంతోషకరమని ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి అన్నారు. విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలో స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

నేడు కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం విపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం నుంచి డి.గౌస్‌దేశాయ్, పి.నిర్మల, టీడీపీ నుంచి సత్రం రామకృష్ణుడితోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని అంగన్‌వాడీలు 31 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమైనట్లు తెలిపారు.

కొనసాగిన అంగన్‌వాడీల దీక్షలు

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు 31వ రోజు సమ్మెను కొనసాగించారు. గురువారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆదోని నుంచి వచ్చిన అంగన్‌వాడీలు 24 గంటల నిరాహార దీక్షలో కూర్చున్నారు. దీక్షను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ప్రారంభించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కల్లూరు: స్థానిక 32వ వార్డులోని 80, 81, 82 వార్డు సచివాలయాలలో గురువారం అంబేడ్కర్ చిత్రపటాలకు వార్డు కార్పొరేటర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ, బీసీ విభాగాల నాయకులు రాజు, గోపీనాథ్, హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాండ్లు తీసుకెళ్లండి

కర్నూలు (లీగల్):లోపాలున్న అగ్రిగోల్డ్ బాండ్లను తీసుకెళ్లాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న ఉదయం 10:30 నుంచి సాయంత్రం5 గంటల్లోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో రశీదులను తీసుకువచ్చి ఒరిజినల్ బాండ్లను వాపసు తీసుకెళ్లాలన్నారు.

ముగిసిన ఐటీసీ వెండర్ జోన్ వేలాలు

- రెవెన్యూకు రూ.4.25 లక్షలు ఆదాయం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ఐటీసీ సర్కిల్ వద్ద ఉన్న వెండర్ జోన్‌కు గురువారం నగరపాలక కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. వీధి వ్యాపారులు ఒకే చోట వ్యాపారం చేసుకునే విధంగా వెండర్ జోన్ నూతనంగా నిర్మించారు. ఇందులోని షాపుల కోసం నగరపాలక రెవెన్యూ అధికారులు రూ.3.50 లక్షలు గుడ్ విల్ విధించారు. ఈ వేలాన్ని దక్కించుకునేందుకు కుమ్మరి పురుషోత్తం (గోకులపాడు), కడెం పెద్దన్న (రాఘవేంద్రనగర్), డి.మహబూబ్‌బాషా (దిన్నెదేవరపాడు), పింజరి షేక్షావలీ (పెద్దపాడు) పోటీ పడ్డారు. అత్యధికంగా రూ.4.25 లక్షలు పాడి వెండర్‌జోన్‌ను కడెం పెద్దన్న దక్కించుకున్నారు. వేలాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

23 నుంచి సమ్మెలోకెళ్తాం

కర్నూలు(అగ్రికల్చర్): తమ సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 23 నుంచి సమ్మెలోకి వెళ్తామని వైకేపీ జిల్లా ఉద్యోగుల జేఏసీ నేతలు అబ్దుల్‌రహిమాన్, కృష్ణుడు, రాఘవేంద్ర, సుబ్బయ్య, లింగేష్, చెన్నయ్య తెలిపారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెర్ప్ సీఈఓ ఇంతియాజ్‌కు, డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషాకు సమ్మె నోటీసులు ఇచ్చామన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో గురువారం స్వామి వివేకనంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొని వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జే.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని దేవాలయంగా భావించాలి

కర్నూలు కల్చరల్: ప్రజాస్వామ్యాన్ని దేవాలయంగా భావించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర సూచించారు. గురువారం నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామ మందిర ప్రారంభానికి కాంగ్రెస్ రాకపోవడం బాధాకరమన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోణంలో చూడటం భావ్యం కాదని హితువు పలికారు. సమావేశంలో బీజేపీ జిల్లా ట్రెజరర్ లోకేశ్వరయ్య, నాయకులు శ్రీను, రామాంజి పాల్గొన్నారు.

ఎవరికీ డబ్బులివ్వొద్దు

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు తమ రెగ్యులరైజేషన్‌కు ఎవరికీ డబ్బులివ్వొద్దని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డ్రాయింగ్ ఆఫీసర్ వద్ద వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలని, అర్హత ప్రమాణాల ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తామని ఆయన తెలిపారు.

బహిరంగ ప్రకటన

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడము ఏమనగా మా కక్షిదారురాలు మార్కాపురము నివాసి శ్రీమతి నారాయణమ్మ W/o సుబ్బరాయుడు గారి సూచన మేరకు జనరల్ నోటీసు ఏమనగా...!

తేది 15-12-2023న నా కక్షిదారురాలు మార్కాపురము బస్టాండు నుండి కర్నూలుకు పోవుచుండగా దస్తావేజు (నెంబరు 5608/1985 తేది 21-08-1985) పడిపోయినందున 25-12-2023న మార్కాపురము టౌన్ పోలీసు స్టేషను నందు రిపోర్టు ఇవ్వడమైనది. ఇందులో భాగంగా సదరు డాక్యుమెంట్‌కు సంబంధించిన ఖాళీ స్థలమును నా కక్షిదారురాలు అవసర నిమిత్తము కర్నూలు నివాసి అయిన షేక్ సలీమాబీ W/o షేక్ బాబా ఫక్రుద్దీన్ గారితో విక్రయ ఖరారు చేసుకోవడమైనది. దీనిపై ఎవరికైన అభ్యంతరములు ఉన్నచో 15 రోజులలోపు తెలువగలరు.

కావున ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ఈ ప్రకటన చూచిన వెంటనే పై తెలిపిన దస్తావేజు నెంబరు 5608/1985 ఎవరికైన దొరికిన ఎడల నాకు గాని నా కక్షిదారురాలికి గాని అందజేయవలెనని తెలియజేయడమైనది.

యం.బాల లక్ష్మయ్య, అడ్వకేటు, కర్నూలు.
సెల్: 79893 90171, 98488 56165

ANDHRA PRADESH STATE FINANCIAL CORPORATION
KURNOOL BRANCH
Opp: Birla Guest House, B.Camp, Kurnool-518002

PUBLIC NOTICE

This is to inform public at large that A.P.S.F.C. sanctioned a Term Loan of **Rs.145.00 lakhs** to **M/s. New National Borewell, Prop: S.Abdul Lateef S/o S.Abdul Gani,** D.No.45/85-31-G, N.R.Nagar, Kurnool. S. Abdu Lateef proposed to offer the following property owned by him as collateral security by depositing the following title deeds.

SCHEDULE OF PROPERTY

RCC building D.No.45/85-31-C (G + 2 Floors) with land admeasuring 112+112=224 Sq.Yds as per Regd. Gift deeds (266 Sq.Yds as per Link sale deed No. 2655/1990) covered by Survey No.777/A2-2, (New) 777-2A2 (Old), Narasimha Reddy Nagar, at Ward No.45, Kurnool City, Sub-Register Office, and District and with common boundaries: **North:** D.No. 45/85-31-E; **South:** Open site; **East:** Road; **West:** Owner's house.

Originals of Regd Gift deed Doc.No.16158/2023 Dt.13.12.2023, Regd Gift deed Doc.No.16436/2023 dt.13.12.2023, Regd. Partition Deed Doc.No.645/1999 dt.10.2.1999, Regd. Sale deed dated 8.8.1990 Doc.No.2655/1990 are submitted.

The General Public / Financial Institutions / Banks are hereby informed that anyone having any objection by claiming any title, right, ownership, charge, claim whatsoever over the above properties, they may kindly intimate the undersigned in writing with relevant proofs within seven days from the date of publication of this notice. Otherwise this property is taken as mortgage as clear title and subsequent objection will not be entertained and the Corporation is not binding for the same.

Date: 12.01.2024, Place: Kurnool — **Sd/- Branch Manager**

వ్యాపారాభివృద్ధిలో కందనవోలు



నగరంలోని ఓ వస్త్ర దుకాంలో వినియోగదారుల సందడి

కర్నూలు కల్చరల్: రాయలసీమ ముఖ ద్వారం.. కందనవోలు (కర్నూలు) వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు చిరు వ్యాపారాలకే పరిమితమైన కర్నూలు నేడు ప్రముఖ నగరాలకు దీటుగా వ్యాపార రంగంలో కొత్త పుంతలు తొక్కుతూ నవ్యతను సంతరించుకుంటోంది. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, జ్యువెలరీస్, ఫర్నీచర్, వైద్యం, లగ్జరీ హోటల్స్, ఫుడ్ కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహా నగరాలకు వెళ్లేవారు. కొంత కాలంగా కర్నూలు వ్యాపార రంగం విస్తరించడంతో పలు కార్పొరేట్ సంస్థలు క్యూకట్టాయి. వస్త్ర దుకాణాలు, మాల్స్, ఆస్పత్రులు, సర్జికల్స్, ఆటోమొబైల్స్ వంటి దుకాణాలు మార్కెట్‌లోకి తరలివచ్చాయి. స్థానిక వ్యాపార సంస్థలు కూడా పోటీగా తమ వ్యాపారాలను విస్తరించాయి. నగర శివారులో బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా పేరెన్నిక గన్న రెస్టారెంట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు నగరం చుట్టూ డూప్లెక్స్, విల్లాస్ నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. ప్రముఖ విద్యాసంస్థల ఏర్పాటుతో జిల్లా వాసులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. పేరెన్నికగన్న కార్పొరేట్ హాస్పిటల్స్ రావడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందుతోంది. పదేళ్లలో వ్యాపార పరంగా కర్నూలు ఊహించనంత అభివృద్ధి సాధించిందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు

కర్నూలు (టౌన్): స్థానిక 15వ వార్డులోని 35, 36, 37 సచివాలయాల్లో మాజీ మేయర్ బంగి అనంతయ్యతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేధార్‌నాథ్ మాధరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరమ్మ, వసంత్, ఆదిశేషు పాల్గొన్నారు.